

ఇన్‌చార్జ్‌ల పాలన ఇంకెన్నాళ్లు?

వరంగల్ వ్యవసాయం, జూన్ 12 : ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్దది ఏనుమాముల (వరంగల్) వ్యవసాయ మార్కెట్. చెప్పుకోవడానికి గొప్పగా ఉన్నా.. పాలన విషయానికొస్తే ప్రభుత్వ యంత్రాగం, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు మార్కెట్‌పై చిన్నచూపు చూస్తున్నారు. సుమారు తొమ్మిది నెలలుగా మార్కెట్‌కు పాలకవర్గాన్ని నియమించలేదు. దీంతో మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ (పీఏసీ)గా మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. వరంగల్ రీజియన్ పరిధిలో ఉన్న 110 వ్యవసాయ మార్కెట్ కమిటీలను పర్యవేక్షించాల్సిన ఆయనకు అదనపు భారంగా ఈ మార్కెట్ కమిటీని కూడా అప్పగించి ప్రభుత్వం చేతులు దులుపుకొంది. పాలకవర్గం లేక పాలన కుంటుపడుతుండడంతో ఇన్‌చార్జ్‌ల పాలన ఇంకెన్నాళ్లు? అంటూ రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. గత ఏప్రిల్ 30న మార్కెట్ కార్యదర్శిగా పనిచేసిన సంగయ్య పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో జమ్మికుంట మార్కెట్ కార్యదర్శిగా పనిచేస్తున్న గుగులోతు రెడ్డిని ఫుల్ అడిషన్ చార్జ్(ఎఫ్ఏసీ)గా ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే మార్కెటింగ్ శాఖలో అరకొర సిబ్బందితో ఉన్నతాధికారులు పెట్టిన లక్ష్యాలను చేరేందుకు అధికారులు సతమతమవుతున్న క్రమంలో అదనపు బాధ్యతలను అంటగట్టి పరుగులు తీయాలని ఆదేశాలిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కాదనలేక, రెండు పడవల మీద ప్రయాణం చేయలేక కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఏ మార్కెట్‌కు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమించడంతో పాటు పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించి రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కుంటుపడుతున్న పాలన

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గం లేక సుమారు తొమ్మిది నెలలు కావస్తోంది. ఇంతపెద్ద మార్కెట్‌కు పాలకవర్గం లేకుండా ఇన్ని నెలల పాటు నడిపిస్తుడడం దురదృష్టకరం. పాలకవర్గం ఉంటే కొన్ని నిర్ణయాలను ధైర్యంగా తీసుకునే అవకాశాలుంటాయి. ఇన్‌చార్జ్‌లకు పలు నిర్ణయాలు తీసుకునే అధికారం లేకపోవడంతో పాలన కుంటుపడుతోంది.

పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించని ప్రభుత్వం

మార్కెట్ ఫీజు తదితర వాటిని లక్ష్యానికి మించి వసూలు చేయాలని నిర్దేశించి అందుకు అను వైన వాతావరణాన్ని కల్పించడంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు చోద్యం చూస్తు న్నారనే ఆరోపణలు వస్తున్నాయి. 2023 సంవత్సరానికి గాను మార్కెట్ ఫీజు రూపేణా సుమా రు రూ.42 కోట్లు వసూలు చేశారు. ఉన్నతాధికారులు నిర్ణయించిన లక్ష్యానికంటే ఎక్కువ వసూలు చేశారు. మార్కెట్‌లో రైతులకు, వ్యాపార, కార్మిక వర్గాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ శ్రద్ధ చూపించాలంటే ఏనుమాముల మార్కెట్ కమిటీకి పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వ్యాపారుల ఆందోళన.. అందుబాటులో లేని కార్యదర్శి

మార్కెట్‌లో మంగళవారం వ్యాపారులు ఆందోళన చేశారు. మార్కెట్ కార్యదర్శి అందు బాటులో లేరు. ఆయన జమ్మికుంట మార్కెట్‌కు వెళ్లారు. జమ్మికుంట మార్కెట్ కార్యదర్శిగా కూడా ఆయనే కొనసాగుతున్నారు. అక్కడి మార్కెట్‌లో ఉన్న సమస్యలను పరిష్క రించేదుకు వారానికి రెండు రోజులు వెళుతున్నారు. కానీ, ఇంత పెద్ద మార్కె ట్‌కు పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించక పోవడంపై రైతు సంఘాలు విమర్శలు చేస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి ఎఫ్ఏసీగా ఉన్న గుగులోతు రెడ్డికే పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తారా.. మరెవరినైనా నియమిస్తారా.. అని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.





ఇద్దరు మంత్రులున్నా.. పాలకవర్గం లేదు..

ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఇద్దరు మహిళా మంత్రులున్నా... ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమించడంలో మాత్రం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారనే విమర్శ లు వినిపిస్తున్నాయి. చొరవ తీసుకోవాల్సిన మంత్రి కొండా సురేఖ మార్కెట్ కమిటీ పాలకవర్గం కూర్పుపై మార్కెట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో ఇప్పటి వరకు చర్చించిన దాఖలాలు లేవంటున్నారు. రాజకీయ కారణాలతో రైతులకు ఇబ్బంది కలిగేలా చేయడం సరైంది కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు దంపతులు స్పందించి ఏనుమా ముల వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమించేందుకు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

- పాలకవర్గం లేక ఏనుమాముల మార్కెట్ నిర్వహణలో ఇబ్బందులు
- పీఏసీ, కార్యదర్శి ఇన్‌చార్జ్‌లే
- పూర్తిస్థాయి కార్యదర్శినీ నియమించని ప్రభుత్వం
- మౌలిక వసతుల కల్పనలోనూ విఫలం
- అవస్థలు ఎదుర్కొంటున్న రైతులు, వ్యాపారులు

వసతుల కల్పనలో విఫలం

ఏనుమాముల మార్కెట్‌తో పాటు లక్ష్మీపురం కూరగాయలు, పండ్ల మార్కెట్లు, పర్వతగిరిలోని సబ్‌యార్డులలో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫల మవుతోంది. దీంతో రైతులు, వ్యాపారులు, కార్మిక వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అధికారులకు ఫీజు వసూళ్లలో ఉన్న శ్రద్ధ మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు, కార్మిక, వ్యాపార వర్గాల నుంచి ఏ సమస్య వచ్చినా.. అధికారులు పాలకవర్గం వచ్చాక చేస్తారని తప్పుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లోకి పందులు, పశువులు వెళ్లి వినియోగదారులపై దాడులు చేస్తున్నాయి. వాటిని అరి కట్టేందుకు సెక్యూరిటీ పెంచాలని చెప్పినా యథాస్థితినే కొనసాగు తోంది. అలాగే మార్కెట్‌లో నిత్యం దొంగత నాలు జరుగుతు న్నాయి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇటు వ్యాపార వర్గాలు, అటు పోలీసు లు చెప్పినా అధికారులు మాత్రం పెడచెవిన పెడుతున్నారు. ఏనుమాముల మార్కెట్‌లో



మిగతా 10వ పేజీలో..



హుషారుగా పాఠశాలలకు వస్తున్న విద్యార్థులు

మోగింది బడి గంట



- పాఠశాలల్లో సందడి
- చిన్నారుల అల్లరితో అలరారిన ఆవరణలు



పాఠశాలకు వస్తున్న చిన్నారులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12 : సెలవులకు టాటా చెబుతూ బడుల బాట పట్టారు విద్యార్థులు. నెల రోజుల పాటు ఇంటి పట్టునే ఉన్న చిన్నా రులు హుషారుగా పాఠశాలలకు తరలివచ్చారు. రోడ్లన్నీ చిన్నారులను, వారి బ్యాగులతో పాటు పాఠశాలలకు తీసుకువస్తున్న తల్లిదండ్రులతో నిండి ఉండటం కనిపించింది. బుధవారం ఉదయం పూట పాఠశాలల్లో విద్యార్థులు ప్రార్థన చేసిన అనంతరం తరగతి గదుల్లో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించారు. కాగా, మంత్రి కొండా సురేఖ ఖిలావరంగల్‌లోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బడిబాట బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. కాగా, ప్రభుత్వ పాఠశాలలు రెండు పూటల తరగతులు నిర్వహిస్తుండగా, ప్రైవేటు పాఠశాలలు ఈ నెల 15 వరకు ఒంటి బడులనే నిర్వహించనున్నాయి.

మిషన్ భగీరథ సర్వేను పూర్తిచేయాలి

- జడ్పీ సీఈవో రామిరెడ్డి



ఊకల్‌లో కార్యదర్శితో మాట్లాడుతున్న సీఈవో రామిరెడ్డి

గీసుగొండ, జూన్ 12 : మండలంలో జరుగుతున్న మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వేను త్వరగా పూర్తిచేయాలని జడ్పీ సీఈవో రామిరెడ్డి అన్నారు. బుధవారం మరియపురం, ఊకల్ గ్రామాలను సందర్శించి మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను త్వరగా పూర్తిచేసి పాత ఇండ్లతో పాటు కొత్త ఇండ్ల వివరాలను కూడా అందచేయాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రభాకర్, కార్యదర్శులు శ్రీధర్, స్వప్న పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

- అహంకారం లేకుండా పని చేయాలి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- మడికొండలో ఎంపీ కడియం కావ్య ఆత్మీయ సన్మాన సభ

9



కడియం శ్రీహరి, కావ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- కుడా కార్యాలయంలో మునిసిపల్ విభాగాల అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ కార్పొరేషన్, జూన్ 12 : రానున్నది వర్షాకాలం అని, గతంలో వరంగల్ నగర ప్రజలు వరదల ద్వారా ఎదుర్కొన్న ఇబ్బందులు పున రావృత్తం కాకుండా అన్ని విభాగాల అధి కారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. 'మాన్‌సూన్ ప్రిపేర్డ్‌నెస్ యాక్షన్ ప్లాన్ అండ్ డెవలప్‌మెంట్‌వర్క్స్‌పై బుధవారం హనుమకొండ కుడా కార్యాలయంలో అన్ని బల్దియా అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మేయర్ గుండు సుధారాణి, పరకాల ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య హాజరైన కార్యక్ర మంలో వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే గ్రేటర్ వరంగల్ పరిధిలో అమలవుతున్న పథకాలు, బడ్జెట్, ఇప్పటి వరకు పూర్తి చేయబడిన పనులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రికి, ఎమ్మెల్యేలకు విశ్లేషించారు. మధ్య మధ్యలో ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. గత వర్షాకాలంలో విస్తారంగా కురిసిన వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. పాత సమస్యలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని గుర్తు చేశారు. ఇప్పటి వరకు అధికారులు చెప్పిన సలహాలు, సూచనలు పాటించి ముందు నుంచే సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించి అక్కడ తిరిగి సమస్య రాకుండా చూడాలన్నారు. ఇంకా మిలిగి ఉన్న పనులను వర్షాకాలం రాక ముందే పూర్తి చేయాలన్నారు. పనులు మిగిలి ఉంటే ప్రతిపాదనలు పెట్టి పనులు పూర్తి చేయాలన్నారు. బల్దియాకు ఇంకా నిధులు కావాలంటే హైదరాబాద్ స్థాయిలో మాట్లాడుతా మని హామీ ఇచ్చారు. ఎన్నికల కారణంగా రెండు నెలల అభివృద్ధి వెనక్కిపోయిందన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా అధికారులు చూడాలన్నారు. అన్ని కాలనీలలో నీరు ఎక్కడ నిలువ ఉండకుండా చూడాలనిఅన్నారు. ఎక్కడ నీరు నిలిచినా ఏదో ఒక మార్గం నుంచి బయటకు వెళ్లిపోయే విధంగా చూడాలన్నారు. ఇంకా కొన్ని గ్రామీణ ప్రాంతాల నుంచి నగరంలోకి నీరు ప్రవహిస్తుంటుందని, నాలాల్లో నిలవకుండా చూడాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు విషయాన్ని ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్‌లకు తెలియజేయాలన్నారు. బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు న్యాయం చేసే విధంగా చూడాలన్నారు. మంత్రిగా ప్రభుత్వం నుంచి జిల్లాకు రావాల్సిన ప్రతీ పైసా విడుదల చేసేందుకు సహకరి స్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక, సంధ్యారాణి, డీఎం హెచ్‌వో సాంబశివరావు, ఇంజనీరింగ్ శాఖ ఈఈ శ్రీనివాసరావు, ఈఈ రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, డీఈ సంజయ్‌కుమార్, మెప్మా టీఎంసీ రమేష్, హార్టికల్చర్ అధికారి రమేష్, డీఎఫ్‌వో శంకర్ లింగంలతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ గొర్రెకుంట ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా సుమారు నాలుగు ఇండ్లు నిర్మించి ఉన్నాయని, ఇంటి యజమానులతో మాట్లాడి వారికి పునరావాసం కల్పించి ఆ ప్రాం తం గుండా బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలకు అంత రాయం ఏర్పడకుండా ఉంటుందని అధికారులకు సూచించారు. దీంతో తగిన పరిష్కార మార్గం చూపిస్తామని ఇంజనీరింగ్ విభాగం డీఈ సారంగం సమాధానమిచ్చారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు మాట్లాడుతూ.. బల్ది యా పరిధిలో ఉన్న కొన్ని విలీన గ్రామాలలో చాలాచోట్ల వీధి లైట్లు వెలగడం లేదని, దీంతో ఆ ప్రాంతం అంధకారాన్ని తలపిస్తుందని చెప్పారు. ఇంకా కొన్ని చోట్ల ఇనుప స్తంభాలు ఉన్నాయని గుర్తు చేశారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు అన్ని చోట్ల స్తంభాలకు లైట్లు బిగించామని, వర్షాకాలం రాకముందే వెలగని లైట్లను మరమ్మతు చేస్తామని ఎలక్ట్రిసిటీ డీఈ సంజయ్‌కుమార్ చెప్పారు.

విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



బుక్స్, యూనిఫాంను అందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి, జూన్ 12 : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించిన మొదటి రోజే విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు అందించిన ఘనత ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేశామని, త్వరలోనే విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యతలను ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమేష్‌బాబు, జడ్పీటీసీ బానోత్ సింగులాల్, ఎంపీటీసీలు మాడుగుల రాజు, బొట్ల మహేంద్ర, జడ్పీ కోఆప్షన్ మెంబర్ సర్వర్, టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనీల్‌రావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ గీత, నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల సంబురాలు

- నగరంలో బాణసంచా కాల్చి మిఠాయిల పంపిణీ



వరంగల్ తూర్పు టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాలుస్తున్న పార్టీ నేతలు

వరంగల్ చౌరస్తా, జూన్ 12 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడుతో పాటు మంత్రివర్గం బుధవారం ప్రమాణస్వీకారం చేయడాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వస్తుందని రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ అన్నారు. వరంగల్ తూర్పు టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ముందుచూపుతో ఏపీ రాష్ట్రానికి బంగారు బాట వేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని అన్నారు. చంద్రబాబు నాయుడు ఏపీ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో అఖిల భారత నందమూరి బాలకృష్ణ యువసేన జాతీయ కన్వీనర్ జీఎల్ శ్రీధర్ ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో మిఠాయిలు పంపిణీ చేశారు. చంద్రబాబు నాయుడు సేవలను కొనియాడుతూ ఐదేళ్లలో ఏపీని బంగారు రాష్ట్రంగా తీర్చిదిద్దుతారన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగవెల్లి సురేష్, నల్లకుంట రవికుమార్, సిరబోయిన రాజు, కందుకూరి రవి, యాసిన్‌తో పాటు ఠాకూర్ గణేష్‌సింగ్, బరిగెల సుధాకర్, బజ్జూరి వీరేశం, తౌటం సంపత్‌కుమార్, కంద్రాతి రాజు, పోలెపాక సాయికుమార్, కానరాతి చిన్నరవి, సింగారపు మురళి, కొండపర్తి సాంబయ్య, ఉడుత రాజు, సింగారపు దేవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



హసన్‌పర్తి, జూన్ 12: ఎర్రగట్టుగుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నలిగంటి సంతోష్‌కుమార్‌కు విశాఖపట్నం గీతం యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి బుధవారం తెలిపారు. 'బ్లడ్ వేసెల్ సిగ్మెంటేషన్ ఫ్రమ్ డయాబెటిక్ రెటినోపతి ఫండస్ ఇమేజెస్ యూజింగ్ సింగులర్ వాల్యూ డికపోజిషన్ అండ్ మాక్సిమమ్ ప్రిన్సిపల్ కర్వేచర్' అనే అంశంపై పరిశోధనలు సమర్పించినందుకు గాను పీహెచ్‌డీ వచ్చినట్లు పేర్కొన్నారు. సంతోష్‌కుమార్‌కు పీహెచ్‌డీ రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి, చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కోశాధికారి నారాయణరెడ్డి, తోటి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

19న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 19న నిర్వహిస్తున్న జాబ్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఐఈవో ఎ.గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం కోసం సీఈసీ, హెచ్ఈసీ, వొకేషనల్ కంప్యూటర్స్ కోర్సుల్లో 75 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఈ జాబ్ మేళాలో డీవీవో రోల్ కోసం ఎంపిక చేసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2023, 2024 విద్యా సంవత్సరాల్లో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు హాజరుకావచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 7569177071 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

కేజీబీవీల్లో సరుకుల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: జిల్లాలోని 9 కేజీబీవీలు, 3 మోడల్ స్కూళ్లు, ఒక్క అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వివిధ సరుకులు సరఫరా చేసేందుకు ఆసక్తిగల వారి నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో అబ్దుల్ హై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సరుకులు, పండ్లు, కూరగాయలు, గుడ్లు, చికెన్, మటన్ తదితర వస్తువులు సరఫరా చేసేందుకు సీల్డ్ టెండర్లు దాఖల చేయాలని తెలిపారు. ఆసక్తి గల వారు కలెక్టర్ పేరున తీసిన రూ.500 డీడీ చెల్లించి టెండర్ ఫారాలు తీసుకొని ఈనెల 21 మధ్యాహ్నం 3 గంటల వరకు డీఈవో కార్యాలయంలోని టెండర్ బాక్స్‌లో వేయాలని కోరారు. వేర్వేరు వస్తువులకు వేర్వేరు టెండర్లు దఖాలు చేయాలని తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోవక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచక ముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

రెసిడెన్షియల్ కోసం అద్దె భవనం కావాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల కోసం ములుగు జిల్లా పరిధిలో అద్దె భవనం కావాలని ఆర్‌సీవో ఎస్.విద్యారాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బాలురు, బాలికల పాఠశాల/కళాశాల నిర్వహణ కోసం 16 తరగతి గదులు, డైనింగ్ హాల్, ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా గదులు, అన్ని వసతులున్న భవనం కావాలని ఆమె కోరారు. ఆసక్తి ఉండి, భవనం ఉన్న వారు 7995010600/7995010599 నెంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

నిజామాబాద్‌కు 12 డీలక్స్ సర్వీసులు

బాలసముద్రం, జూన్ 12: వరంగల్ నుంచి నిజామాబాద్‌కు 12 డీలక్స్ బస్సు సర్వీస్‌లను గురువారం నుంచి నడుపుతున్నట్లు వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మేనేజర్ శ్రీలత ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యం కోసం అదనంగా 12 డీలక్స్ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ నుంచి ఉదయం 4.15 గంటలకు, రాత్రి 11 గంటల వరకు ప్రతీ అరగంటకు ఒక డీలక్స్ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణీకులు వినియోగించుకోవాలని ఆమె ప్రకటనలో కోరారు. వరంగల్ నుంచి నిజామాబాద్‌కు ఒకరికి రూ. 350, హనుమకొండ నుంచి నిజామాబాద్‌కు రూ.340, కరీంనగర్ నుంచి నిజామాబాద్‌కు రూ. 230, హనుమకొండ నుంచి కరీంనగర్‌కు రూ 120 టికెట్ ధర తీసుకోనున్నట్లు శ్రీలత తెలిపారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

● అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ● మడికొండలో ఎంపీ కడియం కావ్య ఆత్మీయ సన్మాన సభ



మడికొండలో జరిగిన అభినందన సభలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు

మడికొండ, జూన్ 12: అధికారం అలంకారం మాత్రమేనని, అది శాశ్వతం కాదని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆత్మీయ పరిచయ, సన్మాన సభలో మంత్రి సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

గత ప్రభుత్వ హయాంలో వారు చేసిన అవినీతి, అక్రమాలే వారి ఓటమికి కారణాలయ్యాయని, అలాంటి పరిస్థితి మనం తెచ్చుకోకూడదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు.. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో నిష్పక్షపాతంగా, అవినీతిరహితంగా ఒక్క రూపాయి ఆశించకుండా నిరుపేదల ఇంటికి చేరే విధంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ విధంగా పనిచేస్తేనే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తారన్నారు. అధికారం ఉంది కదా అని అహంకారం చూపిస్తే బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టినట్టే మన ప్రభుత్వాన్ని సైతం ప్రజలు తిరస్కరిస్తారని హితవు పలికారు. తనకు కూతురులాంటి డాక్టర్ కడియం కావ్య.. తండ్రిని మించిన నాయకురాలిగా ఎదిగి మచ్చ లేని తన తండ్రి పేరును నిలబెట్టాలన్నారు. వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. అలాగే పార్లమెంట్‌లో సమస్యలపై ఎలా గళం ఎత్తాలన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో గళం ఎత్తుతానని అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా ఉంటే రానున్న మరో పదిహేనేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉంటుందన్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు అన్నింటికీ సమ ప్రాధాన్యం ఇచ్చి నిధులు అందజేస్తానని తెలిపారు. అలాగే తనకు రాజకీయ జీవితం ఇచ్చిన తన తండ్రికి మచ్చరాకుండా మంచిపేరు తీసుకు వచ్చేలా పనిచేస్తానని తెలిపారు.

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పాత, కొత్త అనే తేడాలేకుండా పనితరును, అభిమానాన్ని బట్టి అందరికీ అవకాశాలు లభిస్తాయన్నారు. రాజకీయాల్లో మర్యాద, నిజాయితీలే కాపాడుతాయన్నారు. తన మాట తీరు చాలామందికి బాధ కలిగించిదని, అర్థం చేసుకున్న తర్వాత వారే స్వీకరిస్తున్నారన్నారు. నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడితే కార్యకర్తలే గౌరవించరన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో డబ్బు పంచడం, పథకాలు అమ్ముకోవడం సర్వసాధారణమైందని, తాను మాత్రం ఏ పనిచేసినా ఎవరి వద్ద నుంచి కూడా ఒక్క పైసా అడగనన్నారు. ఎవరైనా తన పేరుతో డబ్బులు అడిగితే వారిపై చర్యలు తీసుకుంటానన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అవినీతి రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. కిందిస్థాయి నాయకులు సైతం భూ వివాదాలు, భూ కబ్జాలు, అక్రమాలకు పాల్పడే వారికి వంతపాడకూడదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయని, వాటిపై దృష్టి పెట్టి అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎవరైనా గ్రూపు రాజకీయాలకు పాల్పడితే తోకలు కత్తిరిస్తామని కడియం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇందిర, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతకుముందు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారి నుంచి కావ్యను, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని వాహనంలో కన్వెన్షన్ హాల్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా దారిపొడవునా పూల వర్షం కురిపించారు. టపాసుల మోతతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. బంజారా, లంబాడా మహిళలు తమ సంస్కృతీ సంప్రదాయ దుస్తులు ధరించి బంజారా నృత్యం చేస్తూ కావ్య, శ్రీహరికి ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణుల గజమాలతో కావ్యను, శ్రీహరిని ఘనంగా సత్కరించారు.

తేనెటీగల దాడితో మృతదేహాన్ని వదిలి పరిగెత్తారు..

పలువురికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు





కొత్తగూడ మండలం ఎంచగూడెంలో వీరస్వామి మృతదేహాన్ని వదిలి వెళ్తున్న బంధువులు, గ్రామస్థులు, రోడ్డుపై వీరస్వామి మృతదేహం

కొత్తగూడ, జూన్ 12 : ఓ వ్యక్తి అంతిమయాత్ర నిర్వహిస్తున్న క్రమంలో తేనెటీగలు దాడిచేయగా.. వారంతా మృతదేహాన్ని రోడ్డుపైనే వదిలేసి పరిగెత్తిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెం గ్రామంలో బుధవారం జరిగింది. ఎంచగూడెం గ్రామానికి చెందిన రుద్రారపు వీరస్వామి (50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. బుధవారం అతడి దహనసంస్కారాలు నిర్వహించేందుకు గాను కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు అంతిమయాత్రగా శ్మశానవాటికకు బయల్దేరారు. వారు గ్రామశివారులో చేరుకున్న తర్వాత టపాసులు పేల్చగా వాటి పొగ, శబ్దానికి చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగి లేచి దాడి చేశాయి. దీంతో స్థానికులు, బంధువులు వీరస్వామి మృతదేహాన్ని రోడ్డుపైనే వదిలి పరుగు తీశారు. ఆతర్వాత వారంతా సుమారు గంట తర్వాత అక్కడికి వచ్చి వీరస్వామి మృతదేహాన్ని తీసుకెళ్లి దహనసంస్కారాలు పూర్తి చేశారు. నిర్వహించారు. కాగా, తేనెటీగల దాడిలో కందికొండ యాకయ్య, కందికొండ మల్లయ్య, జిట్టి కొమురయ్యతో పాటు పలువురికి తీవ్రగాయాలు కావడంతో 108లో వరంగల్ జిల్లాలోని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ఏవీవీలో డిజిటల్ తరగతి గది

అందజేసిన పూర్వ విద్యార్థులు

వరంగల్ చౌరస్తా, జూన్ 12 : ప్రస్తుత విద్యా విధానానికి అనుగుణంగా సాంకేతికత ద్వారా విద్యార్థుల విద్యాభ్యున్నతికి తోడ్పడేలా వరంగల్‌లోని ఏవీవీ విద్యా సంస్థలో చదివిన 1982 సంవత్సరం పూర్వ విద్యార్థులు రూ.1.50 లక్షలతో డిజిటల్ తరగతిని నిర్మించి పాఠశాలకు విరాళంగా అందజేశారు. బుధవారం ఏవీవీలో జరిగిన కార్యక్రమంలో విద్యాసంస్థల కార్యదర్శి చందా విజయ్‌కుమార్, చందా శ్రీకాంత్, చకిలం మదన్‌మోహన్‌రావు, మురళీమోహన్‌లకు పూర్వ విద్యార్థుల తరపున చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, చాంబర్ కార్యదర్శి వేదప్రకాష్ ఇతరులు కలిసి పాఠశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ టి.వాసుదేవ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

పాఠశాలల పునఃప్రారంభంలో ప్రజాప్రతినిధులు

తొలి రోజే యూనిఫాంలు, పాఠ్య పుస్తకాల పంపిణీ



క్రిస్టియన్‌కాలనీ పాఠశాలలో దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బాబు



శివనగర్‌లో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ ప్రవీణ్



కరీమాబాద్‌లో విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న కార్పొరేటర్ రవి



వంచనగిరిలో పాఠశాల ప్రవేశం ద్వారం వద్ద స్వాగత తోరణంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



చార్‌బౌళి పాఠశాలలో పుస్తకాల పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పుర్కాన్

ఖిలావరంగల్, జూన్ 12 : బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబు అన్నారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా క్రిస్టియన్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, పాఠ్య, నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు జన్ను వివేక్, నాయకులు కిన్నెర రవి, జక్కం ప్రవీణ్, గడ్డమీది రాజేష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కొమ్మోజు శ్రీధర్ అధ్యక్షతన కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ విద్యార్థులకు దుస్తులు, నోటు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• కరీమాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. బుధవారం కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అర్.మాధవి అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ఇటీవల పదవ తరగతిలో పది జీపీఏ సాధించిన విద్యార్థులను సత్కరించారు. కార్పొరేటర్ మరుపల్ల రవి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు చక్కని విద్యాబోధన అందిస్తున్నారని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయురాలు మాధవి, చైర్‌పర్సన్ జి.పద్మ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

• మట్టెవాడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కన్నం అరుణ అన్నారు. బుధవారం తొలి రోజు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్‌సీలో 10 జీపీఏ సాధించిన విద్యార్థిని గుండు సత్యశ్రీని జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు అరుణ మాట్లాడుతూ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో ఎక్కువ మొత్తంలో విద్యార్థులు పది జీపీఏ సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు యూనిఫాంలను, పాఠ్య, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, షౌకత్ అలీ, భిక్షపతి, అజయ్‌బాబు, ప్రభాకర్, సుదర్శన్, చంద్రకళ, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ సంధ్య, ప్రణిత, ఏఏపీ కమిటీ చైర్‌పర్సన్ రమాదేవి, రమేశ్ పాల్గొన్నారు.

• గిర్మాజిపేట : వరంగల్ కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని మాడుపోజు భువనకృతి టెన్త్‌లో 10 జీపీఏ సాధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసలు పొందగా బుధవారం పాఠశాల పునఃప్రారంభం రోజున ఘనంగా సత్కరించారు. విద్యార్థిని తల్లిదండ్రులు లావణ్య, సుధాకర్‌ను స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ శాలువాతో సత్కరించి మాట్లాడారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సహకారంతో పాఠశాల సమస్యలు పరిష్కరించనున్నట్లు చెప్పారు. అలాగే పాఠశాల పూర్వవిద్యార్థులైన జేఈఈ అడ్వాన్స్‌లో జాతీయ స్థాయి 3719 ర్యాంకర్ మంచాల చంద్రదీప్, నీట్ ర్యాంకర్లు సింగం మహేశ్వరీ, రత్న పురం స్రవంతిలను కార్పొరేటర్ అనిల్ కుమార్ సత్కరించారు. అనంతరం హెడ్‌మాస్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేసి బడిబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు.

• గీసుగొండ : మంత్రి కొండా సురేఖ స్వగ్రామం వంచనగిరిలో బడిబాట సందర్భంగా బుధవారం పాఠశాల పునఃప్రారంభం రోజు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పుస్తకాలు, నోట్‌బుక్‌లు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య, పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతుల గురించి వివరించారు. విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముత్యాలు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పాలనలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎంపీపీ భీమగాని సౌజన్య అన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం మండలంలోని మనుగొండ యూపీఎస్, ఎలుకుర్తి హైస్కూల్‌లో విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య, నోట్ పుస్తకాలను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలకుమార్, దయాకర్, ఉపాధ్యాయులు, ఏఏపీ చైర్మన్లు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• వరంగల్‌సిటీ : నగరంలోని 21వ డివిజన్ ఎల్బీనగర్‌లోని చార్‌బౌళి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు నర్సింగరావు ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ ఎండి.పుర్కాన్ హాజరై విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఏజీపీసీ అధ్యక్షురాలు గోరంటాల లక్ష్మీ, స్టాఫ్ సెక్రటరీ బండారి గంగాధర్ తిలక్, ఉపాధ్యాయులు అశోక్, రమేష్, శ్రీనివాస్, అలీ, హరిక్రిష్ణ, కవిత, నీరజ, లక్ష్మీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

• సంగెం : పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఎంపీపీ కందికట్ల కళావతి అన్నారు. బుధవారం మండలంలోని మోడల్ స్కూల్, హైస్కూళ్లలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అలాగే మామునూరు క్యాంపు, ప్రైమరీ స్కూల్‌లో 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్ విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెడ్మాస్టర్ విక్రమ్‌కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెహ్మాన్, చైర్‌పర్సన్ రాధిక, పీఎస్ హెడ్మాస్టర్ కుమారస్వామి, ఉపాధ్యాయులు గోవిందరావు, సత్యనారాయణరెడ్డి, దానమ్మ, సుజాత, మణిమాల, అనిత, రాజు, శోభారాణి, శాంతకుమారి, సంపత్‌కుమార్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది జీపీఏ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం ప్రశంస పొందిన విద్యార్థి భువనకృతిని సత్కరించిన కార్పొరేటర్ అనిల్‌కుమార్



గవిచర్ల మోడల్ స్కూల్‌లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కళావతి

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

తల్లిదండ్రులు పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలి

అటవీ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న మంత్రి కొండా సురేఖ, తదితరులు

ఖిలావరంగల్, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రాణించాలని రాష్ట్ర అటవీ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం ఖిలావరంగల్ మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బత్తిని ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటతో పాటు దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్‌ను కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనార్జించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో రాణిస్తారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి రోజునే దుస్తులు, పాఠ్య, నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టారన్నారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులను స్నేహితులుగా భావించి విద్య అందించాలన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా తీర్చిదిద్దనున్నారన్నారు. మధ్యాహ్న వంట కార్మికులు విద్యార్థులకు పౌష్టికరమైన భోజనాన్ని అందించాలన్నారు.

కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మహిళా గ్రూపుల సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 21 రోజుల్లో యూనిఫాంలను అందజేశామన్నారు. అలాగే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్‌ను సైతం అందజేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు దుస్తులు, పాఠ్య, నోటు పుస్తకాలు అందజేయడం అభినందనీయమన్నారు. వరంగల్ జిల్లాలో గత విద్యా సంవత్సరంలో విద్యార్థులు సాధించిన కార్యక్రమాలతో పాటు వివిధ రంగాల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఇటీవల జిల్లా స్థాయిలో మ్యాథ్స్, సైన్స్‌తో పాటు, 2023-24 సంవత్సరం పదవ తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమదామోదర్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా పాత ఫ్లెక్సీనే..



కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పాత ఫ్లెక్సీ

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12: విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు సామాజిక స్పృహను నేర్పించాల్సిన ప్రధానోపాధ్యాయురాలు తప్పులో కాలేసింది. ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం కొలువు దీరి చాలాకాలం అవుతున్నా పాత ప్రభుత్వపు బడిబాట ఫ్లెక్సీనే ఏర్పాటు చేసిన సంఘటన నగరంలోని కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. వివరాల్లోకి వెళితే... జిల్లాలోని ఖిలావరంగల్ మండలం కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కొత్త ఫ్లెక్సీ ఏర్పాటుకు బదులుగా పాత ఫ్లెక్సీలో తేదీలను మార్పు చేశారే తప్ప పైన ఉన్న గత ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాత్రం అలాగే ఉంచడంతో పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు అవాక్కయ్యారు. ఈ విషయాన్ని స్థానిక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్తర్ మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వాసంతి దృష్టికి తీసుకెళ్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై ఫిర్యాదు చేశారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం..



వేసవి సెలవులు ముగిశాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. సుమారు నెలన్నర రోజుల పాటు ఆటపాటలతో సరదాగా గడిపిన చిన్నారులు పుస్తకాలు బ్యాగులు భుజాన వేసుకుని బడిబాటపట్టారు. కానీ వారికి సర్కారు బడుల్లో పాతసమస్యలే స్వాగతం పలికాయి. కొన్ని చోట్ల అయితే గతంలో ప్రారంభించిన అభివృద్ధి, సుందరీకరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో నగరంలోని మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఉదయం ఓ వైపు విద్యార్థులు ప్రార్థన చేస్తుండగానే మరో వైపు ఆవరణను చదును చేసే పనిలో భాగంగా కూలీలు కంకర డస్టును విరజిమ్మారు. ఆ సమయంలో ఎగసిన దుమ్ముతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిని చూసిన వారు అభివృద్ధి పనుల నిర్వహణలో నిర్లక్ష్యానికి ఇదే ఓ నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

క్లాత్ సంచులు పంపిణీ చేసిన ఎన్‌జీవో



కూరగాయల మార్కెట్ ఆవరణలో క్లాత్ సంచులు పంపిణీ చేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవిందర్‌రెడ్డి తదితరులు

గిర్మాజిపేట, జూన్ 12 : 'ప్లాస్టిక్‌ను నివారిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం' లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ పర్యావరణ ఎన్‌జీవో నెట్‌వర్క్ సంస్థ బుధవారం వరంగల్ కూరగాయల మార్కెట్‌లో ఉచితంగా వెయ్యి క్లాత్ సంచులను పంపిణీ చేసింది. తెలంగాణ పర్యావరణ ఎన్‌జీవో నెట్‌వర్క్ సంస్థ రాష్ట్ర కన్వీనర్ విజయబాబు, డాక్టర్ పరికి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవిందర్‌రెడ్డితో కలిసి స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ క్లాత్ సంచులను అందజేశారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు రవిందర్‌రెడ్డి, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌లు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం రోజు రోజుకు పెరుగుతుండడంతో పర్యావరణం కలుషితం అవుతూ మానవ మనుగడ ప్రమాదంలో పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లు, బ్యాగుల వినియోగానికి బదులుగా బట్ట, జనపనార, కాగితపు సంచులను వినియోగించాలని తద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలిద్దామని అన్నారు. తెలంగాణ పర్యావరణ ఎన్‌జీవో నెట్ వర్క్ సంస్థ ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించేందుకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే రాష్ట్ర వ్యాప్తంగా క్లాత్ సంచులు ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనివారు కోరారు.

ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ ప్రసాదరావు, మార్కెట్ కార్యదర్శి రాము, కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షుడు జారతి శ్రీనివాస్, పర్యావరణవేత్త రతన్‌సింగ్, తెలంగాణ పర్యావరణ ఎన్‌జీవో నెట్‌వర్క్ ప్రతినిధులు రమేష్, డాక్టర్ కుమారస్వామి, స్పాన్సర్ కుమారి రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూన్ 12 : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ శంకేసి మల్లిఖార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. శంభునిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని రంగశాయిపేట, తెలంగాణ కాలనీ, సాయినగర్, రామాలయం ఏరియా, నాగమయ్య టెంపుల్, ఫోర్ట్ రోడ్డు పెట్రోల్‌పంపు ఏరియా, అన్నపూర్ణ కాంప్లెక్స్, సాయిబాబా టెంపుల్, పద్మశాలీ స్ట్రీట్, విశ్వనాథ కాలనీ, షైన్ మాస్టర్ స్కూల్, గిరిప్రసాద్ కాలనీ, టీచర్స్ కాలనీ, గణేశ్‌నగర్ కాలనీ ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ శంకేసి మల్లిఖార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు.

పర్యాటక శాఖకు బ్యాటరీ కారు

వృద్ధుల సౌకర్యార్థం అందించిన యూబీఐ



బ్యాటరీ కారు నడుపుతున్న మంత్రి

ఖిలావరంగల్/వరంగల్ చౌరస్తా, జూన్ 12: నగరానికి వచ్చే వృద్ధ, దివ్యాంగ పర్యాటకుల సౌకర్యార్థం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా(యూబీఐ) పర్యాటక శాఖకు బ్యాటరీ కారును అందజేసింది. బుధవారం మంత్రి కొండా సురేఖ ద్వారా జిల్లా కలెక్టర్ సమక్షంలో ఖిలావరంగల్‌లో బ్యాటరీ కారును పర్యాటక శాఖకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎల్.రాజు, యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ పి.సత్యం, యూనియన్ బ్యాంకు సిబ్బంది రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మల్లమ్మ (ఫైల్)

శంభునిపేట, జూన్ 12 : నగరంలోని రంగశాయిపేటకు చెందిన శతాధిక వృద్ధురాలు మండల మల్లమ్మ(104) మంగళవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. మల్లమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతుంది. రజాకారుల ఆగడాలను అడ్డుకున్న నాటి బృందంలో మల్లమ్మ భర్త బలరాములు ఒకరు. బలరాములు గతంలోనే మృతి చెందారు. మల్లమ్మకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు తిరుపతి మృతి చెందాడు. స్థానిక 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, రావుల బాలరాజు తదితరులు మల్లమ్మ భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుమారులు మండల వెంకటయ్య, అశోక్, ప్రభాకర్, కూతురు బాలుగు భారతమ్మలతో పాటు చిరంజీవి, రమేష్, నరేష్, హరీష్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుధవారం రంగశాయిపేటలోని హిందూ శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

అఖిల భారత పద్మశాలీ సంఘం 26వ డివిజన్ అధ్యక్షుడిగా రమేష్

వరంగల్ చౌరస్తా, జూన్ 12: అఖిల భారత పద్మశాలీ సంఘం 26వ డివిజన్ అధ్యక్షుడిగా కూచన రమేష్‌ను నియమిస్తూ వరంగల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వద్నాల నరేందర్ నియామక పత్రం అందజేశారు. బుధవారం పద్మశాలీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యా విభాగం అధ్యక్షుడు డాక్టర్ వంగర సూర్యనారాయణ, పద్మశాలీ నాయకులు గోరంటల రాజు, బాసాని శ్రీనివాస్, నందాల చందర్‌బాబు, పెనుమల్ల అమర్‌నాథ్, కూచన శ్రీకాంత్, గుడిమళ్ల ప్రతాప్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌ల పాలన ఇంకెన్నాళ్లు?

(7వ పేజీ తరువాయి)

65 సీసీ కెమెరాలున్నప్పటికీ పనిచేయడం లేదు. అయినా గుత్తేదారుకు డబ్బులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా దడువాయిలు మరో 50 పీవోసీ మిషన్లు కొత్తవి తెప్పించాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. మార్కెట్లలోని యార్డు క్లీనింగ్ విషయంలో పనులు జరుగకున్నా డబ్బులు మాత్రం చెల్లిస్తున్నారు. మార్చిలో ఎన్నికల కోడ్ ఉందని పలు టెండర్లను రద్దు చేసినా.. ఎన్నికల కోడ్ ముగిసినా పలు పనుల కోసం కొత్త టెండర్లను మాత్రం పిలవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు పాలకవర్గంతో పాటు పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయండి

మంత్రి కొండా సురేఖకు తూర్పు జర్నలిస్టుల వినతి


ఖిలావరంగల్, జూన్ 12 : జర్నలిస్టుల కోసం రెండేళ్ల క్రితం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందచేయాలని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను వరంగల్ తూర్పు జర్నలిస్టులు కోరారు. బుధవారం ఖిలావరంగల్ మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా జర్నలిస్టులు మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రెండేళ్ల క్రితం 200 మంది జర్నలిస్టుల కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించిందన్నారు. ఎన్నికల కారణంగా పంపిణీ కార్యక్రమం నిలిచిపోయిన ఇళ్లను జర్నలిస్టులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటానని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు బండి రవి, కమటం వేణుగోపాల్, అజయ్, అమీర్, చిన్నబాబు, వంశీ, అనిల్, ప్రభాకర్, వెంకన్న, రమేష్, క్రిష్ణ, గంగరాజు, నితీష్, నాగరాజు, శ్యామ్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రాధక్క ఆశయాలను కొనసాగిద్దాం : ఎన్డీ



రాధక్క చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఖిలావరంగల్, జూన్ 12: భారత విప్లవోద్యమ నాయకురాలు రాధక్క ఆశయాలను కొనసాగిద్దామని న్యూడెమోక్రసీ జిల్లా నేత గంగుల దయాకర్ అన్నారు. బుధవారం ఖిలావరంగల్ అమరవీరుల స్థూపం వద్ద రాచర్ల బాలరాజు అధ్యక్షతన రాధక్క చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ నాయకురాలు, గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నిర్మాత చంద్ర పుల్లారెడ్డి సహచరి రాధక్క మంగళవారం హైదరాబాద్‌లో క్యాన్సర్ వ్యాధితో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఆమె ఆశయాలను నేటి యువత కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు బండి కోటేశ్వర్‌రావు, బండి రమేష్, వేణుగోపాల్, ఆకుల కుమారస్వామి, బైరబోయిన అయిలయ్య, గంద్రాతి హరిబాబు, ఇనుముల కృష్ణ, ఎమ్డీ.అక్బర్, వీరన్న తదితరుతలు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 13 జూన్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుకొండ

మెన్‌స్ట్రువల్ కప్‌తో బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ముప్పు నివారణ

వర్ధన్నపేట, జూన్ 12 : టాక్సిక్ షాక్ సిండ్రోమ్ వంటి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ప్రమాదాల నివారణ నుంచి రక్షణ పొందేందుకు మెన్‌స్ట్రువల్ కప్స్ ఎంతగానో దోహదపడుతాయని బాలవికాస ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వసంత అన్నారు. బుధవారం వర్ధన్నపేట కేంద్రంలోని బాలవికాస సెంటర్‌లో మెన్‌స్ట్రువల్ హెల్త్, మెన్‌స్ట్రువల్ కప్ పంపిణీ, వాడకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వసంత మాట్లాడుతూ మెన్‌స్ట్రువల్ కప్స్ వినియోగం వల్ల పర్యావరణానికి, ప్రకృతికి ఎలాంటి హానీ జరుగకుండా ఉంటుందని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించిన వారవుతామని అన్నారు. బాలవికాస, అమెజాన్ సంస్థ సహకారంతో మెన్‌స్ట్రువల్ కప్స్‌ను మహిళలకు, యువతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ పిట్టల రాణి, బాలవికాస ప్రతినిధులు ఫాతిమా, అనురాధ, స్వాతి, చందనతో పాటు వివిధ గ్రామాల మహిళలు, యువతులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మండల కేంద్రంలో

ఇళ్ల స్థలాలు అందించాలి

మండల సభ తీర్మానం



మండల సభలో తీర్మానం చేస్తున్న ఎంపీటీసీలు

దుగ్గొండి, జూన్ 12 : తెలంగాణ ఉద్యోగులకు మండల కేంద్రంలో ఇళ్ల స్థలాలు అందించాలని బుధవారం ఎంపీపీ కాట్ల కోమల అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో చాపలబండ ఎంపీటీసీ పిండి కుమారస్వామి ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని ఎంపీటీసీలు బలపరచగా మండల సభ ఆమోదించింది. దుగ్గొండి ఎంపీటీసీ రాజు మాట్లాడుతూ ఆస్పత్రులలో సిబ్బంది, వైద్యులు సమయ పాలన పాటించే విధంగా చూడాలని సభలో కోరారు. జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫామాయిల్ తోటలు పెంచాలని తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు రైతులను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఆరుంధతి, తాహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఏఈ వెంకటేశ్వర్లు ఏవో దయాకర్, డాక్టర్ కిరణ్‌రాజు, ఎంఈవో చదువుల సత్యనారాయణ, ఎంపీటీసీ బండి జగన్నాథం, మామునూరి సుమన్, అధికారులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారంపై నివేదికను కలెక్టర్‌కు పంపిస్తాం



నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మండల అధికారులు

రాయపర్తి, జూన్ 12 : మండలంలోని పన్యానాయక్ తండాలో నిర్మాణ తలపెట్టిన కోళ్ల ఫారం ప్రాంతాన్ని బుధవారం మండల తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్‌ల ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు కోళ్ల ఫారం ప్రాంతాన్ని పరిశీలించి, చుట్టూ ప్రక్కల రైతుల వాంగ్మూళాలు, గ్రామస్థుల సమస్యల వివరాలు నమోదు చేసుకున్నామని తెలిపారు. కోళ్ల ఫారం కనీసం నిబంధనలను సైతం పరిశీలించి నివేదిక తయారు చేసి పూర్తి వివరాలను కలెక్టర్‌కు అందిస్తామని, తదుపరి చర్యలు కలెక్టర్ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారుల రాకతో తండావాసులు భారీగా తరలి వచ్చి కోళ్లఫారాన్ని నిర్మించకూడదని మళ్లీ ఆవేదన వెల్లబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భూక్యా క్రాంతి, మాజీ ఎంపీటీసీ మాలోతు దేశీరాం, నాయకులు భూక్యా పూజారి, డాక్టర్ భూక్యా రాజారాం, రవి, కిషన్, శంకర్, రమేష్, రవి, బుజ్జి, సుగుణమ్మ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి

నర్సంపేట, జూన్ 12 : నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారధి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో విద్యార్థులు చదువు కోవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలను వెలుబడుతున్నందున పరీక్షలు నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. నీటి పరీక్షలను రద్దుచేయాలని దక్షినాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పినా వారి మాటను పెడచెవిన పెట్టడం వల్ల వేలాది మంది విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో శివమణి, స్టాలిన్, అనిల్‌కుమార్, సాయి పాల్గొన్నారు.

మోగిన బడిగంట..

పునఃప్రారంభమైన పాఠశాలలు

విద్యార్థులకు పూలు అందించి స్వాగతం

ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందజేత

తక్కువ సంఖ్యలో విద్యార్థుల హాజరు

నర్సంపేట టౌన్, జూన్ 12 : వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు బుధవారం పునః ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాలల పనివేళల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు బుధవారం ఉదయం 9 గంటలకు, హై స్కూళ్లల్లో 9.30గంటలకు బడిగంట మోగింది. మొదటి రోజు విద్యార్థులు పాఠశాలలకు రావడానికి మొగ్గుచూపకపోవడంతో తక్కువ శాతం హాజరు నమోదైనట్లు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. నర్సంపేట మండలంలోని 41ప్రాథమిక పాఠశాలలు, ఆరు ప్రాథమికోన్నత పాఠశాలలు, 12 హైస్కూళ్లల్లో 3వేల 395 మంది విద్యార్థులకు గాను 664 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంఈవో రత్నమాల తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం రోజున వివిధ పాఠశాలల్లో యూనిఫాం, పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.

• వర్ధన్నపేట రూరల్: మండలంలోని ఇల్లందలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు గ్రామస్థులు వినూత్న రీతిలో స్వాగతం పలికారు. తమ గ్రామంలోని సర్కారు బడికి స్వాగతమంటూ వారికి పూలు చల్లుతూ, డప్పు చప్పుల్ల నడుమ పూలబాట వేసి బడిలోకి ఆహ్వానించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నల్లబెల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీటీసీ దుగ్యాల జ్యోతి మాధవరావులు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. బండౌతపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మొదటి రోజు హెచ్ఎం శేఖర్ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల తీరు తెన్నులను వివరించి, గ్రామంలో ప్రభుత్వ బడికి విద్యార్థులు వచ్చేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవులు, శ్రీనాథ్, కుమారస్వామి, ఏఏపీసీ చైర్మన్ కవిత, మాజీ సర్పంచులు పెంచాల కుమారస్వామి, తూళ్ల కుమారస్వామి, రాయపురపు కుమారస్వామి, సామాజిక కార్యకర్త మోడెం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ : ప్రభుత్వ పాఠశాలలో అనుభవం, అర్హతకలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యబోధనలు చేస్తుడడంతో విద్యార్థుల విద్యాజీవితం బంగారు భవిష్యత్తు అవుతుందని నెక్కొండ ఎంపీపీ జాటోతు రమేశ్ అన్నారు. బుధవారం పాఠశాలలు పునర్‌ప్రారంభం కావడంతో విద్యార్థులకు పువ్వులను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని విద్యార్థులకు 16,611 పుస్తకాలు అవసరం ఉండగా, 13,468 పుస్తకాలు సరఫరా అయ్యాయన్నారు. ఇంకా 3,143 పుస్తకాలు అందించాల్సి ఉందని ఎంపీపీ చెప్పారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో రవికుమార్, పాఠశాల చైర్మన్ మార్త లావణ్య, హెడ్మాస్టర్ జాన్‌నాయక్, అప్పల్‌రావుపేట హెడ్మాస్టర్ కె.రవీందర్, ఉపాధ్యాయులు ఐలయ్య భారతి, గంగాధర్, సీఆర్పీలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

• నల్లబెల్లి : గుండ్లపహాడ్ ప్రభుత్వ బడిలో ప్రధానోపాధ్యాయుడు ఎండీ రాయబోస్ సమక్షంలో విద్యార్థులకు అక్షరభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలను, యూనిఫామ్స్, నోట్ బుక్స్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రతిభావంతంగా నృత్యాలను చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బడిలో విద్యార్థులకు స్కూల్ బట్టలను, పాఠ్యపుస్తకాలను మండల నోడల్ అధికారి బైరి సరళ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మానుపాటి పాపమ్మలు అందజేశారు. అనంతరం విద్యార్థులకు అక్షరభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోతె ఇంద్రసేనరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధనతో పాటు ఉచితంగా బోధన సామగ్రి ఇస్తున్నారని జిల్లా అధికారి మండల స్పెషల్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రారంభం రోజున విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాట్ల కోమల, ఎంపీడీవో ఆరుంధతి, ఎంఈవో చదువుల సత్యనారాయణ, హెచ్ఎం రామస్వామి, వీవో అధ్యక్షురాలు బైగాని శ్రావణి, ఎంపీటీసీ రాజు, ఏఈ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• ఖానాపురం : మండలంలోని బుధరావుపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు విద్యార్థులకు పంపిణీచేశారు. అనంతతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బిక్కి లింగమ్మ మురళి, సుభాన్‌బీమౌళాన, ఎంఎన్‌ఓ చరణ్‌సింగ్, కాంప్లెక్స్ హెచ్ఎం హరిఫ్ హుస్సేన్, హెచ్ఎం పద్మావతి, సీఆర్పీలు శశిధర్, బాస్కర్ పాల్గొన్నారు.

• రాయపర్తి : మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. రాయపర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, ఎంపీటీసీ ఐత రాంచందర్‌లు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. తిర్మలాయపెల్లిలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందించారు.

• గీసుగొండ : మంత్రి కొండా సురేఖ స్వగ్రామం వంచనగిరిలో పాఠశాల పునఃప్రారంభం రోజున పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో సమావేశం నిర్వహించి ప్రభుత్వపాఠశాలలో ఉచిత పుస్తకాలు, నోట్‌బుక్‌లు, సన్న బియ్యంతో మధ్యాహ్నభోజనం, ఆంగ్లమాధ్యమంలో నాణ్యమైన విద్య, పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులను వివరించారు. విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముత్యాలు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తుందని ఎంపీపీ భీమగాని సౌజన్య అన్నారు. మండలంలోని మనుగొండ యూపీఎస్, ఎలుకుర్తి హైస్కూల్‌లో విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య, నోట్ పుస్తకాలను ఆమె అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలకుమార్, దయాకర్, ఉపాధ్యాయులు, ఏఏపీ చైర్మన్లు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• సంగెం: పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఎంపీపీ కందికట్ల కళావతి అన్నారు. బుధవారం మండలంలోని మోడల్ స్కూల్, హైస్కూళ్లలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను,ఏకరూప దుస్తులను పంపిణీచేశారు. మామునూరు క్యాంపు, ప్రైమరీ స్కూల్‌లో 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్ విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెడ్మాస్టర్ విక్రమ్‌కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెహ్మాన్, చైర్‌పర్సన్ రాధిక, పీఎస్ హెడ్మాస్టర్ కుమారస్వామి, ఉపాధ్యాయులు గోవిందరావు, సత్యనారాయణరెడ్డి, దానమ్మ, సుజాత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పూలతో స్థానికుల స్వాగతం



నెక్కొండ పీఎస్‌లో విద్యార్థులకు పువ్వులతో సాగతం పలుకుతున్న ఎంపీపీ



నర్సంపేట మండలం ఇటుకాలపల్లి హైస్కూల్‌లో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



గవిచర్ల మోడల్ స్కూల్ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలు



చెన్నారావుపేటలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



గుండ్లపహాడ్‌లో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేస్తున్న ఉపాధ్యాయులు

సహకార రంగాన్ని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలి



మార్నేని రవీందర్‌రావును సన్మానిస్తున్న ఉద్యోగులు

నెక్కొండ, జూన్ 12 : రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ చైర్మన్‌గా ఎంపికైన ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార సంఘం చైర్మన్ మర్నేని రవీందర్‌రావును వరంగల్‌లో ఉద్యోగులు బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకొని సన్మానించారు. ఈ సందర్భంగా సహకార సంఘం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్రజనరల్ సెక్రెటరీ, నెక్కొండ సొసైటీ సీఈవో మెడెం సురేష్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా సహకార సంఘాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిపర్చి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుపాలని, నూతన చైర్మన్ రవీందర్‌రావు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం వరంగల్, మహబూబాబాద్, హన్మకొండ, ములుగు, భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు ఏరుకల శ్రీనివాస్, మల్లారెడ్డి, భూపాల్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీధర్, నాయకులు వెంకటయ్య, సురేష్, రమణాచారి, మురళి, సుభాష్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : తెలంగాణ స్టేట్ కో ఆపరేటీవ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్‌గా నియమితులైన మార్నేని రవీందర్‌రావును బుధవారం కాంగ్రెస్ శ్రేణులు హనుమకొండలోని డీసీసీబీ బ్యాంకులో ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి సంది మధుకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి కొండేటి మధుకర్, పీఏసీఎస్ డైరెక్టర్ హెచ్.లక్ష్మి, హెచ్.సుధాకర్, జె.భిక్షపతి తదితరులు రవీందర్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

'రాధక్క మృతి పీడిత ప్రజలకు తీరని లోటు'

నర్సంపేట, జూన్ 12 : గోదావరిలోయ ప్రతిఘటన ఉద్యమ నిర్మాత చంద్రపుల్లారెడ్డి జీవిత సహచరి రాధక్క మృతి పీడిత ప్రజలకు తీరనిలోటని న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం రాధక్క చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు.రాధక్క దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకం, పీడిత ప్రజలసమస్యల సాధనకోసం అనేక పోరాటాలను నిర్వహించారన్నారు. అనా రోగ్యంతో రాధక్క మృతి చెందడం ప్రతిఘటన పోరాటాలకు, పీడిత ప్రజలకు తీరనిలోటన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి తిరుపతి, సారంగపాణి, పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి అజయ్, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పూలక్క, పీవైఎల్ నాయకులు పాల్గొన్నారు.

సమాచార కమిషనర్‌ను నియమించాలని సీఎంకు లేఖ



సీఎంకు లేఖను పంపిస్తున్న భట్టు సాంబయ్య

నల్లబెల్లి, జూన్ 12: సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్‌ను నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టాఫీసు ద్వారా లేఖను, విజ్ఞాపన పత్రాన్ని బుధవారం సామాజిక వేత్త పంపారు. ఈ సందర్భంగా భట్టు సాంబయ్య మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం 2005 ననుసరించి తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్‌ను నియమించాలని కోరారు. రాష్ట్ర సమాచార హక్కు కార్యాలయంలో వేల పెండింగ్ కేసులు ఉన్నాయన్నారు.సీఎం చొరవ తీసుకొని కమిషనర్‌ను నియమించాలని కోరారు. అప్పుడే సమాచారాన్ని కోరిన పౌరులందరికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మామిండ్ల పెద్ద ఐలయ్య, రమేష్‌లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌ల పాలన ఇంకెన్నాళ్లు?

(7వ పేజీ తరువాయి)

65 సీసీ కెమెరాలున్నప్పటికీ పనిచేయడం లేదు. అయినా గుత్తేదారుకు డబ్బులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా దడువాయిలు మరో 50 పీవోసీ మిషన్లు కొత్తవి తెప్పించాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. మార్కెట్లోని యార్డు క్లీనింగ్ విషయంలో పనులు జరుగకున్నా డబ్బులు మాత్రం చెల్లిస్తున్నారు. మార్చిలో ఎన్నికల కోడ్ ఉందని పలు టెండర్లను రద్దు చేసినా.. ఎన్నికల కోడ్ ముగిసినా పలు పనుల కోసం కొత్త టెండర్లను మాత్రం పిలవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు పాలకవర్గంతో పాటు పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూళనకు పాటుపడాలి

నర్సంపేట, జూన్ 12 : బాలకార్మిక వ్యవస్థ నిర్మూళనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ పాటుపడాలని స్వయంకృషి స్వచ్ఛందసంస్థ కార్యదర్శి బెజ్జంకి ప్రభాకర్ పిలుపు నిచ్చారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విజ్‌డమ్ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. కార్య క్రమంలో పాఠశాల డైరెక్టర్ జావేద్, అకాడమిక్ ఇన్‌చార్జ్ నజ జియాఇక్బాల్, వైస్ ప్రిన్సిపల్ ప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కేఏస్ ఆర్ కాన్సెప్ట్ స్కూల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జీవన్‌రెడ్డి, ఏఎస్ఆర్ సంస్థ నిర్వాహకులు ఎ ద్రబోయిన రాజశేఖర్, మొగిలిచర్ల రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

నర్సంపేట టౌన్, జూన్ 12 : నర్సంపేట మండలం కమ్మపల్లిలో ముదిరాజ్‌ల కులదైవం పెద్దమ్మతల్లి బోనాల పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహిళలు తమ తమ ఇళ్ల నుంచి బోనాలతో పెద్దమ్మ తల్లి గుడి వద్దకు తరలి వచ్చారు. అనంతరం అమ్మవారికి హారతులు, నైవేద్యాలను సమర్పించి పూజలుచేశారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, పెండ్యాల మధు, భిక్షపతి, రవి, నరేందర్, సాంబయ్య, మునీందర్, తదితరులు పాల్గొన్నారు.

పేరుకే జిల్లా ఆస్పత్రి..

అత్యవసర సేవలకు వరంగల్‌కు పరుగు

వైద్యులు, సిబ్బంది కొరతతో రోగుల ఇక్కట్లు



నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రి

నర్సంపేట టౌన్, జూన్ 12 : నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు చూస్తే పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందంగా తయారైంది. నర్సంపేట నియోజకవర్గంలోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, చెన్నారావు పేట, ఖానాపురం, నెక్కొండ మండలాలతో పాటు మహబూబాబాద్ జిల్లా లోని గూడూరు, కొత్తగూడ మండలాల్లోని గ్రామాల పేద ప్రజలకు ఏకైక దిక్కుగా ఉన్నటువంటి నర్సంపేట జిల్లా ఆస్పత్రికి అత్యవసర సేవల కోసం వస్తే ఇక అంతే సంగతులు.. ప్రాణాలపై ఆశ వదిలేయాల్సిందే.. లేదంటే వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు పరుగు తీయాల్సిన దుస్థితిని పేద ప్రజలు ఎదుర్కొంటున్నారు. వివరాలిలా వున్నాయి. నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి మొదట 50పడకల ఆస్పత్రిగా, ఆ తర్వాత సివిల్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయింది. ప్రస్తుతం 80పడకలతో రోగులకు చికిత్సలందిస్తున్నారు. ఇటీవల జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసిన అధికారులు ఆ స్థాయిలో పడకలు, వైద్య సౌకర్యాల కల్పనలో, వైద్యులు, సిబ్బందిని నియమించడంలో విఫలమయ్యారు. విధులు నిర్వరిస్తున్న వారిలో అనేక మందికి ప్రైవేట్ ఆస్పత్రులు ఉండడంతో వాటిపైనే ఉన్న శ్రద్ధ విధుల పట్ల చూపకపోవడంతో తరుచూ వైద్యుల మధ్య గొడవలకు దారితీస్తున్నా యి. కొంతమంది వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్ల అంతోఇంతో పేద ప్రజలకు వైద్యం అందుతుంది. సాధారణ రోగాలకు వైద్యం అందుబాటులో ఉన్నప్పటికీ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం మాత్రం అందని ద్రాక్షలా మారింది.

సిటీ స్కాన్‌కు దిక్కులేదు..

జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రతీ రోజు చేతులు, కాళ్లు విరగడం, తలలు పగిలి తీవ్ర రక్తస్రావాలతో అత్యవసర చికిత్సల కోసం నర్సంపేట ఆస్పత్రిని క్షతగాత్రులు ఆశ్రయిస్తారు. వీరంతా ఆస్పత్రికి రాగానే ప్రాథమిక చికిత్స అనంతరం శరీరంలో ఏ స్థాయిలో గాయాలయ్యాయో తెలుసుకోవడానికి అవసరమైన పరికరం సిటీ స్కాన్ ఆస్పత్రిలో లేదు. ఎవరికైనా గుండెపోటు, పక్షపాతం వంటి కార్డియాలజీ, న్యూరాలజీకి సంబంధించిన రోగులు వస్తే సంబంధిత వైద్యులు లేకపోవడంతో ప్రాథమిక చికిత్స చేసి వరంగల్‌కు రెఫర్ చేయడం నిత్యకృత్యమైపోయింది. రెఫర్ చేసినరోగి వరంగల్‌కు వెళ్లే వరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. అనేక మంది రోగులు మధ్యలోనే ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి.

వైద్యులు, సిబ్బంది కొరతతో ఇక్కట్లు

ప్రతీ రోజు ఓపీ, ఇన్‌పేషంట్లుగా ఆస్పత్రికి వస్తుండడగా, వీరికి చికిత్సలందించేందుకు అవసరమైన సంఖ్యలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్య విధాన పరిషత్, జిల్లా మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) శాఖలకు 33 మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో గైనకాలజిస్టులు-4, పిల్లల వైద్యులు-3, జనరల్ ఫిజిషియన్‌లు-3, ఆర్థోపెడిక్-1, కంటి వైద్యులు-2, డెంటిస్టు ఒక్కరు విధులు నిర్వర్తిస్తుండగా మిగతా వారు జనరల్ వైద్య విభాగంలో పనిచేస్తున్నారు. వీరితో పాటు 14 మంది నర్సులు, 9 మంది ఎన్ఎన్ఎంలు, 22 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు.

ఒక్కో బెడ్‌పై ఇద్దరికి వైద్య సేవలు


ఆస్పత్రిలో 80 పడకలుండగా అంతకు మించి రోగులు వస్తున్నారు. దీంతో వీరికి వైద్య సేవలందించాలంటే వైద్యులు సతమతమవుతున్నారు. చేసేది లేక ఒక్కో బెడ్‌పై ఇద్దరికి వైద్య చికిత్సలందిస్తున్నారు. దీని వల్ల రోగులు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఒక రోగి పడుకొనివుంటే మరో రోగి కూర్చొని వైద్య చికిత్సలు పొందాల్సిన దుస్థితి నెలకొంది.

పారిశుధ్య సిబ్బందికి నాలుగు నెలలుగా అందని వేతనాలు

ఆస్పత్రిలో సానిటేషన్ విభాగంలోని పేషింట్ కేర్, సెక్యూరిటీ, సానిటేషన్‌లో 39మంది పనిచేస్తున్నారు. వీరికి గత నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు గడవక నానా అగచాట్లు పడాల్సి వస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలంతా పనిచేస్తే వచ్చే రూ. 10 వేలు కూడా నెలనెలా రాకపోవడంతో కుటుంబాలు ఆర్థాకలితో అలమాటించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

220 పడకల ఆస్పత్రిలోకి మారితే సమస్యలకు పరిష్కారం

డాక్టర్ పి.గోపాల్, జిల్లా వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల సూపరింటెండెంట్



జిల్లా ఆస్పత్రి నర్సంపేట పట్టణ శివారులో త్వరలో ప్రారంభం కానున్న 220పడకల ఆస్పత్రిలోకి మారితే సమస్యలన్నింటికి పరిష్కారం లభిస్తుంది. ప్రస్తుతం ఉన్నటువంటి వైద్యులతో రోగులకు సమర్థవంతంగా వైద్య చికిత్స లందిస్తున్నాం. మెరుగైన వైద్య చికిత్సలందించడానికి ప్రతీ విభాగంలో వైద్య పరికరాలతో పాటు ఐదుగురు డాక్టర్లు ఉండాల్సి వస్తోంది. 220 పడకల ఆస్పత్రిలోకి జిల్లా ఆస్పత్రి మారితేనే అది సాధ్యమవుతుంది. త్వరలోనే ఆస్పత్రి అందుబాటులోకి వచ్చి సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలందనున్నాయి.